క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను ఈఓ , అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు



ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పండ్లు, పూలతో అలంకరించారు. స్వామివారికి 11 రకాల హారతులు, విశేషపూజలు, మహామంగళ హారతి ఇచ్చారు. భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఉపాధి కూలీలకు పట్టల పంపిణీ



ఉపాధి మేటీలకు పట్టలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామం బైరప్ప చెరువు ప్రదేశంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద గురువారం ఎంపీటీసీ ప్రవంతి ఉపాధికూలీలకు పట్టలను ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎంపీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధిపనుల ప్రదేశంలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు పట్టలను మంజూరు చేసిందన్నారు. పనిప్రదేశంలో సంబంధిత మేటీలు తప్పకుండా ప్రతి రోజు కూలీలకు నీడసౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని కరివేన ఎస్సార్‌బీసీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, పండ్లు, బ్రెడ్లులను వైఎస్సార్‌సీపీ నాయకులు మొమిన్ మునీర్ బాషా, గోసలాజం ,మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రషీద్ గురువారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దివంగత జిలానీ 13వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. సర్పంచ్‌గా ఆత్మకూరులో 50 సంవత్సరాల పాటు ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు ఎంపిక కావడం విశేషమన్నారు. అనంతరం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ్, అలి, జాకీర్‌హుస్సేన్, ఇబ్రహీం, కలిముల్లా, అతావుల్లా, జబ్బార్‌బాబు, ఖమ్రుద్దీన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో గురువారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు, ఆర్టీసీ ఏఎస్ఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఉండడం వలన డివిజన్‌లోని ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాలతో పాటు నందికొట్కూరు డివిజన్‌పరిధిలోని వివిధ మండలాలకు సత్వర సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం అగ్నిమాపక విన్యాసాలను ప్రదర్శించారు. అగ్నిమాపక కేంద్ర అధికారి భీముడు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు అహ్మద్ రసూల్, కలిముల్లా, యునస్, రహమాన్,రషీద్, రహీమ్ పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

కొత్తపల్లి: గ్రామాలలో గ్రామ వలంటీర్ల చేత ఎస్‌డీజీ సర్వే వేగవంతంగా చేయించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో అధికారులో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ సర్వేలో గర్భిణులు, 0-5 పిల్లలు, 6నుంచి 19 సంవత్సరాల పిల్లల వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. అలాగే విద్యార్థి వివరాలు, ఏ పాఠశాలలో చదువుతున్నారు వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయాలు పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో పీఓఎల్ఆర్ డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- కుక్కకాటుకు గురవుతున్న ప్రజలు
- రాత్రి వేళ బయటికి వెళ్లాలంటే జంకుతున్న జనం
- శునకాల నియంత్రణకు చర్యలు చేపట్టని అధికారులు



నందికొట్కూరులోని ఓ వీధిలో పోట్లాడుతున్న కుక్కలు

నందికొట్కూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు విజృంభిస్తున్నాయి. కుక్కకాటుకు గురవుతున్న ప్రజల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీధుల వెంట నడిచి వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రి వేళల్లో ఏ సందులో నుంచి ఏ కుక్క వచ్చి దాడి చేస్తుందోనని అనుక్షణం భయపడుతూనే ఇంటికి చేరుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ వీధిలో చూసిన వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతు రోడ్లపై నడిచి వెళ్లే వారినే కాకుండా, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని వెంటాడి మరీ గాయపరుస్తున్నాయి.

కుక్కకాటు కేసుల వివరాలు..

పట్టణంలో ఈ నెల 5వ తేదీ వరకు 10 మంది కుక్కకాటుకు గురై ఆసుపత్రి పాలయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాదిలో-1,023, బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీలో 319, పగిడ్యాల-425, కొత్తపల్లి-1,200, గోకవరం-800, ఎర్రమఠం-650, మిడుతూరు-444, పాములపాడు-578, జూపాడుబంగ్లా-130, పారుమంచాల-95 కుక్క కాటు కేసులు నమోదైనట్లు ఆయా పీహెచ్‌సీల వైద్యులు తెలిపారు. వీధి కుక్కల నుంచి రక్షించాలని ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్న నియంత్రణకు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అందుబాటులో ఇంజెక్షన్లు

ప్రభుత్వ వైద్యశాల్లో యాంటీ ర్యాబిస్ ఇంజెక్షన్లు సమృద్ధిగా ఉన్నాయి. నందికొట్కూరు నియోజకవర్గంలో మిడుతూరు మండలంలోని కడుమూరు, తలముడిపి, పగిడ్యాల మండలంలోని ప్రాతకోట పీహెచ్‌సీ సెంటర్లలో యాంటీ ర్యాబిస్ ఇంజెక్షన్లు నిలువ ఉంచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కుక్కకాటుకు గురైన ప్రజలు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్తే ఉచితంగా సూదులు వేస్తారు.

కుక్కల నియంత్రణ ఆపరేషన్ ఏదీ


కుక్కల సంతతిని నియంత్రించేందుకు వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాల్సి ఉంది. నియోజకవర్గంలో అలాంటి ఆపరేషన్లు చేసిన దాఖలాలు లేవు. కుక్కల సంఖ్యలో రోజు, రోజుకు పెరిగిపోతున్న నివారించేందుకు మున్సిపల్, గ్రామపంచాయతీల అధికారులు ఎలాంటి చర్యలు పట్టించుకోవడం లేదు.

స్వచ్ఛంద సంస్థల వ్యతిరేకత



వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటే స్వచ్ఛంద సంస్థల నుంచి, మరోక పక్క బూ క్రాస్ నుంచి నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వీధి కుక్కలకు ఆపరేషన్లను మధ్యలో నిలిపివేశాం. కుక్కలకు వ్యాక్సిన్లు వేస్తున్నాం. వీధుల కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. - ఏ.ఎస్ రాయుడు డాక్టర్

బరక సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామి వార్లకు అమావాస్యను పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, తదితర విశేషపూజలను పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేదమంత్రోచ్చరణల మధ్య మన్యసుక్త హోమం జరిపించారు. అలాగే స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు



జెడీహెచ్ స్కూలు వద్ద చేతిపంపునకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచు వరప్రసాద్

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో చేతిపంపులకు సర్పంచు వరప్రసాద్ గురువారం మరమ్మతులు చేయించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో, చేతి పంపులు పనిచేయక ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రజలు నీటికష్టాలను దూరంచేయాలనే ఉద్దేశంతో ఎప్పటికప్పుడు చేతిపంపులు మరమ్మతులు చేయిస్తూ గ్రామంలో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తుమ్మలూరులో జెడ్పీ హెచ్ స్కూలు, ఎస్సీ కాలనీ, మజరా కృష్ణారావుపేట గ్రామంలో ఎస్సీ కాలనీల్లో చేతిపంపులు మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి సహకారంతో గ్రామంలో ఎప్పటికప్పుడు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఏఎన్ఎంను సస్పెండ్ చేయాలి

పగిడ్యాల: ఆశావర్కర్ నజీరున్నీసా ఆత్మహత్యా యత్నానికి కారకురాలైన ఏఎన్ఎం సావిత్రిని తక్షణమే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణగౌడ్, జి.బాబులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న సావిత్రి గత 6 నెలలుగా నజీరున్నీసాను వేధింపులకు గురి చేస్తూ విధుల నుంచి తొలగించామని భయపెట్టింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆశావర్కర్ శనివారం నిద్ర మాత్రలు మింగి ఆతహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు శేషమ్మ, సరోజిని, రమణమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

పగిడ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం లక్ష్మాపురం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఆరె కటికల అభివృద్ధికి కృషి చేద్దాం



కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యులను సన్మానించి వినతిపత్రం అందజేస్తున్న సంఘ పెద్దలు

శ్రీశైలం: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆరెకటిక కులాల అభివృద్ధికి కృషి చేద్దామని కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ గురువారం పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్యతో కలిసి ఆరె కటిక కుల అన్నదానసత్ర రెండో సెల్లార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆరెకటికలు వెనుకబడిన వర్గాలలో ఉన్నప్పటికీ బీసీ-ఏ గ్రూప్‌లో చేర్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలియజేశారు.

హస్తకళల అభివృద్ధికి పెద్ద పీట

- హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ విజయలక్ష్మి



ఫ్లూట్‌లను పరిశీలిస్తున్న హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ విజయలక్ష్మి

నందికొట్కూరు: హస్తకళల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ విజయలక్ష్మి అన్నారు. గురువారం పట్టణానికి విచ్చేసిన హస్తకళల కార్పొరేషన్ చైర్ పర్సన్‌కు తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం వారు ఘన స్వాగతం పలికారు. చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సుబ్బారావుపేటలో హస్త కళాకారులు చిలకా మల్లికార్జున వెదురు బొంగులతో తయారు చేసిన ఫ్లూట్(పిల్లన గ్రోవులు)లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ హస్తకళాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న లేపాక్షి ఎంపోరియం ద్వారా తయారు చేసిన ఫ్లూట్‌ను విక్రయించేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు అవకాశం ఇప్పిస్తానని చెప్పారు. కర్నూలు ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య, సిబ్బంది కిషోర్, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ చౌడేశ్వరీ దేవాలయ కమిటీ అధ్యక్షులు రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు ఆర్ట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగులకు ఉపాధి పని మస్టర్ ఎలా వేస్తారు?'



ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు: కోళ్లబావాపురం గ్రామంలో ఆయా శాఖలలో పని చేసే ఉద్యోగులకు ఉపాధి పని చేసినట్లు మస్టర్ ఎలా వేస్తారని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కోళ్లబావాపురం గ్రామానికి చెందిన ఆయా శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు శివకుమార్, రాముడు, పార్థసారథి, కవితకు మస్టర్లు వేయడం దారుణమన్నారు. అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ భారతిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగార్జున, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులు



ఈద్గా వద్ద శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ

నందికొట్కూరు: రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలను శుభ్రం చేయిస్తునట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ తెలిపారు. గురువారం పట్టణంలోని ఈద్గాలను మున్సిపల్ వైస్ చైర్మన్, మత పెద్దలు శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ పరమ పవిత్రమైన రంజాన్ పండుగ సమీపిస్తున్న తరుణంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా శుభ్రం చేస్తునామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరు జాకీర్ హుసేన్, ముస్లిం మత పెద్దలు వజీరబాష, వలి, ముజీబ్, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళలపై అఘాయిత్యాలు జరిగినా పట్టించుకోరా?'

జూపాడుబంగ్లా: మహిళలపై అఘాయిత్యాలు, దౌర్జన్యాలు జరిగినా పోలీసులు పట్టించుకోరా అని మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు కె రంగమ్మ, జిల్లా అధ్యక్షురాలు జయమాధవి ప్రశ్నించారు. గురువారం జూపాడుబంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ పారుమంచాల గ్రామానికి చెందిన ఎం లలితమ్మ అనే మహిళపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ దౌర్జన్యం చేసి, నానాబూతులు మాట్లాడి దాడికి పాల్పడ్డారన్నారు. వారిపై కేసునమోదు చేయాలని ఈనెల 15న జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ వెంకటసుబ్బయ్యకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే జూపాడుబంగ్లాకు చెందిన మదార్‌బీ ఇంటిపైకి వచ్చి గ్రామానికి చెందిన కొంత మంది ఆమెను, ఆమె కూతురు, అల్లుడిపై దాడిచేశారని, వారిపై ఈనెల 16న ఫిర్యాదు చేసినా ఎస్ఐ పట్టించుకోలేదని తెలిపారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య మహిళల పట్ల నిర్లక్ష్యపు ధోరణి అవలంభించటం తగదన్నారు. ఈ విషయమై ఎస్ఐ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా పారుమంచాల గ్రామానికి చెందిన లలితమ్మ అనే మహిళ ఇతరులపై దాడిచేయటంతో కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఆమె కౌంటర్‌కేసుకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేయలేదని తెలిపారు. జూపాడుబంగ్లాకు చెందిన మదార్‌బీ దర్గా విషయంలో ఘర్షణ పడగా ఆమె వారి తోరాజీ అయ్యిందని, దీంతో కేసు నమోదు చేయలేదని వివరణ ఇచ్చారు.

రంజాన్ మాసంలో సేవలతో పుణ్యఫలం

- ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



వైస్ ఎంపీపీ లక్ష్మీనరసమ్మతో కలిసి ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: పవిత్రమైన రంజాన్ మాసంలో చేసే దానాలు, సేవా కార్యక్రమాలకు ఎంతో పుణ్యఫలం దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బుక్కాపురం గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, ఆమె కుమారుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కుంచపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం రాత్రి గ్రామంలోని మసీదువద్ద ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి స్థానిక మసీదు వద్ద ముస్లిం సోదరులతో వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మసీదు వద్ద ప్రహరీ నిర్మాణానికి సహకారం అందిస్తానన్నారు. అలాగే శ్రీనగరం వద్ద శ్మశానానికి కాంపౌడ్ వాల్ నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు కుంచపు వెంకటేశ్వర్లు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, తిమ్మాపురం సొసైటీ చైర్మన్ పగడాల నాగరాజు, గోపవరం సర్పంచ్ వంకె సుదర్శనం, నాయకులు కందుల వెంకటసుబ్బారెడ్డి, ఒంటెద్దు వీరారెడ్డి, కందుల రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ధోబీ ఘాట్‌లో నీటి సమస్యకు పరిష్కారం

- నూతన బోరు తవ్వించిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



నూతన బోరులో నీరు పడిన దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని కలమందలపాడు గ్రామానికి చెందిన రజకులు ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు ధోబీఘాట్‌కు నూతన బోరు మంజూరుచేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి బోరుబండిని పంపించి నూతన బోరు తవ్వాలని ఆదేశించారు. గురువారం కలమందలపాడు గ్రామానికి సమీపంలో ఉన్న రాజాపురం సమీపంలో నూతన బోరును తవ్వారు. బోరుబావిలో దాదాపు 3 ఇంచుల నీరు పడినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు కమతం వీరారెడ్డి తెలిపారు. నూతన బోరులో నీరు పడటంతో గ్రామానికి చెందిన రజకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ముసలిమడుగులో 'జగనన్నే మా భవిష్యత్తు'

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామంలోని బీసీ కాలనీలో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకుడు కదిరి సుబ్బన్న, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ మా నమ్మకం నువ్వే జగన్ గోడ స్టిక్కర్లను, మొబైల్ స్టిక్కర్లను అతికించారు.

ఆధార్ నమోదు కేంద్రం పరిశీలన

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం, సంకిరేణిపల్లె సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ పుల్లయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆధార్ నమోదుకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించి, తప్పులు దొర్లకుండా ఆధార్ వివరాలను అప్‌లోడ్ చేయాలని డిజిటల్ అసిస్టెంట్‌లకు ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సమతయశోదర, కోట్ల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న శివశంకర్‌నాయక్, సరళమ్మ

జూపాడుబంగ్లా: మారుతున్న వాతావరణ పరిస్థితులను అనుసరించి రైతులు ఎప్పటికప్పుడు శాస్త్రసాంకేతికపరమైన ఆధునిక పద్ధతులను అవలంభించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని మహానంది అగ్రికల్చర్ కళాశాల డీన్ శివశంకర్‌నాయక్, డాట్‌సెంటర్ కోఆర్డినేటర్ సరళమ్మ సూచించారు. గురువారం మండ్లెం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. అనంతరం మహానంది, తిరుపతి అగ్రికల్చర్ కళాశాలలకు చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు ఆధునాతన వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం ఒక్కో బీఎస్సీ విద్యార్థిని, రైతుతో అనుసంధానం చేసి మూడు మాసాల పాటు వారికి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు డీన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు దేవానందం, శశికుమార్, ఏఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి విక్రయం



మట్టిని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మైనర్ ఇరిగేషన్ అధికారులకు నామమాత్రపు రుసుము చెల్లించి ఇటుకల తయారీ కోసమంటూ తంగడంచ, పారుమంచాల, మండ్లెం చెరువుల్లోని మట్టిని మూడేళ్ల క్రితం తవ్వుకొని నిల్వ చేసుకున్నాడు. తవ్వుకున్న మట్టితో ఇటుకలు తయారు చేయాల్సిన వ్యాపారి మట్టి విక్రయానికి తెరలేపాడు. తాను తోలుకొన్న మట్టిని రైతులకు ఓ ట్రాక్టర్ మట్టి రూ.750ల చొప్పున విక్రయించుకొని సొమ్ముచేసుకుంటున్నాడు. నిత్యం వంద, రెండు వందల ట్రాక్టర్ల చొప్పున మట్టిని విక్రయిస్తూ రోజుకు రూ.లక్ష నుంచి రూ.1,50,000ల సొమ్మును పోగుచేసుకుంటున్నాడు. కళ్లెదుటే అక్రమమట్టి వ్యాపారం జరుగుతున్నా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, మైనర్‌ఇరిగేషన్ అధికారులు ఎవ్వరూ పట్టించుకోకపోవటం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటుకల పేరు చెప్పి అక్రమంగా మట్టి వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తునిపై తగిన చర్యలు తీసుకొని మట్టిదందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

అనధికార విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): పత్తి, మిరప విత్తనాలకు సంబంధించి అనధికారిక విత్తనాలను విక్రయించే డీలర్లపై సీడ్ యాక్టు ప్రకారం చర్యలు తప్పవని ఏడీఏ రాజశేఖర్, డీఏఓ కార్యాలయ టెక్నికల్ అసిస్టెంట్ రంగారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో పత్తి, మిరప విత్తనాల విక్రయ డీలర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలను విక్రయించరాదని, విత్తనాలు కొన్న రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. బిల్లు లేకుండా విత్తనాలు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కేంద్రం నిరంకుశపాలనను వ్యతిరేకించాలి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ నిరంకుశ పాలనను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం కార్యదర్శి రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం ప్రచార భేరీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజలపై భారం వేస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తున్న ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటీకరించడం అన్యాయమన్నారు. పట్టణంలోని వాకిలిపేట రాజావీధి, గొల్లపేట, కొత్తపేట, ఎస్పీజీ పాలెం, ఏబీయం పాలెం, కల్లావీధి, కర్నూలు రహదారి వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంతకుమారి, స్వాతి, రాజుద్దీన్, అహ్మద్‌హుస్సేన్, సద్దామ్ హుస్సేన్, వెంకటశివుడు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కేసీ ద్వారా 1.37 లక్షల ఎకరాలకు సాగునీరు

నంద్యాల(అర్బన్): రబీలో కేసీ కెనాల్ ద్వారా 1.37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల్లో కేసీ కెనాల్‌కు సంబంధించి 90,500ఎకరాల ఆయకట్టు ఉండగా ఈనెల 15వరకు 1.37లక్షల ఎకరాలకు సాగునీరు అందించి పంటల సాగుకు తోడ్పాటునిచ్చామన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి దిగుబడులు, ధరలు ఆశాజనకంగా ఉండటంతో రబీలో సైతం వరిసాగైందన్నారు. ఇప్పటికే తాగునీటి కుంటలను సైతం నింపామని, దాదాపు 0.78 టీఎంసీలు సుంకేసుల బ్యారేజీలో తాగునీటి అవసరాల నిమిత్తం నిల్వ ఉంచామని చెప్పారు. ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అలగనూరు ఫీడర్ చానెల్ ద్వారా కుందూనదికి నీటిని వదిలామని చెప్పారు.

ప్రకృతి వర్ణాలు..!



ప్రకృతిని మించిన చిత్రకారుడు ఉండడు. ఆస్వాదించాలే కానీ ఆకాశంలో ఎన్నో అందాలు... ఒక్కో క్షణం ఒక్కొక్క కలర్‌లో ఎన్నెన్నో వర్ణాలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తుంటాయి. సూర్యోదయం, సంధ్యవేళలో ఆకాశంలో అగుపించే సప్తవర్ణాలు శోభాయమానంగా అగుపిస్తాయి. ఈ క్రమంలో మహానందిలో గురువారం సాయంత్రం కనిపించిన రంగురంగుల వర్ణాల ఆకాశం.

- మహానంది